క్లుప్తంగా

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. మంగళవారం మొగల్తూరులో వ్యాపార సంస్థలకు వారాంతపు సెలవు కావడంతో గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓపెన్ ఆడిటోరియం నిర్మాణానికి నిధులివ్వాలి



మాట్లాడుతున్న వంక రవీంద్ర

నరసాపురం: నరసాపురంలో నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా పునర్నిర్మించే పనులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిందని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు నిలిపేశారని శాసనమండలిలో ఎమ్మెల్సీ వంక రవీంద్ర ప్రస్తావించారు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలు చేసుకోవడానికి వీలుగా ఉంటుదనే మంచి లక్ష్యంతో ఓపెన్ ఆడిటోరియం పనులను గత ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. అలాంటి మంచి పనిని నిలుపుదల చేయడం తగదన్నారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

పెనుగొండ: రైతులు, ప్రజల పాలిట ఉరి తాళ్లుగా మారుతున్న ట్రూఅప్ చార్జీలను తక్షణం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఆచంట మండలం 8వ మహాసభ మంగళవారం ఆర్యవైశ్య క్షేత్రంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చార్జీలు తగ్గిస్తామని చెప్పి, నాలుగు నెలలకే రూ.18 వేల కోట్లు భారం ప్రజలపై మోపిందన్నారు. కార్యక్రమంలో అల్లం నాగమ్మ, తలుపూరి బుల్లిబ్బాయి, సిర్రా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ టాయిలెట్స్ డే



వడలి జెడ్పీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెనుగొండ: మండలంలోని వడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వరల్డ్ టాయిలెట్స్ డే నిర్వహించారు. విద్యార్థులకు స్వచ్ఛభారత్ పై అవగాహన కల్పించి, ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టీఎస్ఎన్ మూర్తి, ఎంఈఓ డి.శుభాకరరావు, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ ఎం.బాబ్జీ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల ట్రాక్టర్ బోల్తా



పెనుగొండ శివారు అదుపు తప్పి పంటబోదేలో బోల్తాపడిన ట్రాక్టరు

పెనుగొండ: పెనుగొండ శివారు నక్కల డ్రెయిన్ సమీపంలో ఇటుకల లోడు ట్రాక్టరు అదుపు తప్పి పంటబోదేలో బోల్తా పడింది. మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి నుంచి భీమవరం వైపు వెళుతూ ట్రక్కుకు ఉన్న పిన్ను ఊడిపోవడంతో పంటబోదేలోకి దూసుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ట్రాక్టరుపై ఉన్న కూలీలకు గాయాలు కావడంతో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డీఈఈ గణేశ్వరరావుకు ఘన నివాళి

పెనుగొండ: విజయవాడలో ఆర్అండ్‌బీ డీఈఈగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన మైలే గణేశ్వరరావుకు మాల మహానాడు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం గణేశ్వరరావు స్వగ్రామం ఆచంట మండలం కోడేరు ఉత్తరపాలేనికి ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. మైలే మృతి దళిత జాతికి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. నివాళులర్పించిన వారిలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, కోలాటి ప్రసాదరావు, బన్ను రాంబాబు, నాగరాజు, భావన శ్రీనివాస్, భావన ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అటకెక్కిన గ్రంథాలయ భవన నిర్మాణం

- కూటమి ప్రభుత్వంలో నిలిచిన లైబ్రరీ నిర్మాణ పనులు
- రూ.1.18 కోట్లతో మూడంతస్తుల భవనం నిర్మాణానికి పూనుకున్న గత ప్రభుత్వం



కాటన్‌పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయ నిర్మాణ పనులు నిలిచిపోయిన దృశ్యం

నరసాపురం: పట్టణంలో కాటన్‌పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయం నూతన భవన నిర్మాణ పనులను కూటమి సర్కార్ వచ్చిన తరువాత పూర్తిగా నిలిపేసింది. ఈ ఏడాది గ్రంథాలయ వారోత్సవాలను నూతన భవనంలో జరపాలని లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. దీంతో ప్రస్తుతం గ్రంథాలయ వారోత్సవాలు అరకొర వసతులున్న అద్దె భవనంలోనే జరుగుతున్నాయి. మొత్తంగా ఇక నరసాపురం శాఖా గ్రంథాలయానికి కొత్త భవనం ఇప్పటిలో లేనట్టేననే వాదనలు వినిపిస్తున్నాయి. 2023 జనవరిలో గ్రంథాలయ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ద్వారా రూ.1.28 కోట్లు మంజూరు చేసింది. దీంతో అదే ఏడాది ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వేస్టేషన్ రోడ్డులోని కాటన్‌పార్కు వద్ద 25 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించారు. దీంతో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కాబోతుందని అందరూ భావించారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు అర్థాంతంగా నిలుపుదల చేశారు.

నరసాపురం గ్రంథాలయానికి 70 ఏళ్ల చరిత్ర

1954లో నరసాపురంలో గ్రంథాలయం స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్–1 గ్రంథాలయంగా కొనసాగుతుంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతి రోజూ 200 మంది వరకూ రీడర్స్ వస్తారు. అయితే ఈ గ్రంథాలయానికి భవనమే అసలు సమస్య. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతున్నాయి. ఇరుకు గదుల్లో, ఆరు బయట పుస్తకాలు చదవాల్సిన పరిస్థితి. అయితే గత ప్రభుత్వ చర్యలతో సొంత భవనం సమకూరుతుందనుకుంటే కూటమి సర్కార్ చర్యలతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో లైబ్రరీ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చినా స్థలం చూపించని పరిస్థితి. అయితే దాదాపు 70 ఏళ్ల ఈ సమస్యకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దారి చూపించింది. కానీ కూటమి సర్కార్ నిర్లక్ష్యంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

ప్రాజెక్ట్‌లు ఒక్కోటి నిలిపేస్తున్నారు



నరసాపురం అభివృద్ధికి గత ప్రభుత్వ మంజూరు చేసి, మొదలు పెట్టిన పనులు కూడా ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిచిపోతున్నాయి. ఇది దారుణం. నరసాపురం లైబ్రరీ పురాతనమైనది. ఇప్పటి వరకూ సొంత భవనం లేకపోవడం బాధాకరం. దీనిని దృష్టిలో పెట్టుకుని లైబ్రరీ భవనానికి రైల్వే స్టేషన్‌రోడ్డులో విలువైన మున్సిపాలిటీ స్థలాన్ని కేటాయించాం. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టించారు.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు వారి పేర్లను తమ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

పంచారామ క్షేత్రాల దర్శనానికి బస్సులు

నరసాపురం: ఈ కార్తీకమాసంలో ప్రతి సోమవారం పంచారామ క్షేత్రాలను దర్శించుకునే విధంగా నరసాపురం డిపో నుంచి బస్సుల సదుపాయం కల్పించినట్టు ఆర్టీసీ ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ మూర్తి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24న చివరి కార్తీక సోమవారం సందర్భంగా అదనంగా ప్రత్యేక బస్సులు తిప్పుతున్నామని చెప్పారు. ఆదివారం రాత్రి 7:30 గంటలకు రెండు బస్సులు బయలుదేరతాయన్నారు. సోమవారం అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు క్షేత్రాలకు తీసుకెళ్లి తీసుకొస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల తనిఖీ



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్ రామ్‌సింగ్

పాలకొల్లు సెంట్రల్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ అన్నారు. మంగళవారం పాలకొల్లు విచ్చేసిన రామ్‌సింగ్ ముందుగా పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్‌సింగ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ముఖ్యంగా పాలకొల్లుకు 133 కేవీ ఏర్పాటుకు కృషి చేస్తామని దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాలకొల్లు, అడవిపాలెంలో ఉన్న సబ్ స్టేషన్, ఇండోర్ స్టేషన్లను పరిశీలించారు. ఈయన వెంట ఏపీఈఆర్‌సీ మెంబర్ రామారెడ్డి, రఘునాథబాబు, సత్యనారాయణ, కె.మధుకుమార్ తదితరులు ఉన్నారు.

శిరగాలపల్లిలో పొలం పిలుస్తోంది



రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి

యలమంచిలి: రైతులు తమకు నచ్చిన మిల్లుకే ధాన్యం తోలుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి చెప్పారు. శిరగాలపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు ధాన్యం కొనుగోలు గురించి పలు సూచనలు చేశారు. ధాన్యం 75 కేజీల బస్తాకు రూ. 1725 మద్దతు ధర ఇస్తామన్నారు. కాబట్టి రైతులు కోతలు అవ్వగానే ముందుగా ధాన్యం ఏ మిల్లుకు తరలించాలని అనుకుంటారో? ఆ సమాచారం సంబంధిత రైతు సేవా కేంద్రం వద్ద ఇవ్వాలని ఆమె చెప్పారు. ధాన్యం సేకరణకు అవసరమైన 50,000 గోనె సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. పంటల బీమా చెల్లించడానికి డిసెంబర్ నెలాఖరు వరకు గడువుందని, వరి పంటకు ఎకరాకు రూ.615 బీమా చెల్లించాలని ఆమె కోరారు. బ్యాంకు రుణాలు ఉన్న రైతులకు బీమా బ్యాంకు అధికారులే జమ చేస్తారన్నారు. బ్యాంకు రుణాలు లేని రైతులు ఈ–సేవా కేంద్రాలు, సచివాలయాల్లో బీమా సొమ్ము చెల్లించి రసీదు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు రంగన్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జ్యోతి, సోని, జడ్డు బదరి రైతులు తమ్మినీడి సీతారాముడు, నాదం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



నరసాపురం: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: పుస్తక ప్రదర్శనలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

నరసాపురం: పట్టణంలోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరాగాంధీ చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కేజీఎస్ఎల్ కుమారి, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ అల్లూరి నళినీదేవి, సీనియర్ న్యాయవాది టి.సంతోష్‌కుమారి, వనిత క్లబ్ అధ్యక్షురాలు ఉషాకమల తదిరులు పాల్గొన్నారు.

ఛాంబర్స్ కళాశాలలో

పాలకొల్లుసెంట్రల్: విద్యార్థులకు పోటీపరీక్షలకు, పరిశోధనలకు, సృజనాత్మకతకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చాంబర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఛాంబర్స్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలు విశ్వవిజ్ఞానానికి పునాదులు వేస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు మాణిక్యాలరావు, రాధామాదవి, మీనా, వరప్రసాద్, ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు శారీరకంగా దృఢంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: మహిళలు శారీరకంగా, మానసికంగా చాలా దృఢంగా ఉండాలని పట్టణ సీఐ కోలా రజనీకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్‌లో యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో మహిళల దాడులపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రజనీకుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో అపరచితులతో స్నేహాలు చేయవద్దని సూచించారు. యువతులు విద్యలో ముందుకు వెళుతూ అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు డెంటల్ కళాశాల హెచ్ఓడీ డాక్టర్ పద్మప్రియ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్షుడు జక్కంపూడి మధన్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ప్రభాకరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఇందిర, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



నరసాపురం రూరల్: ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



పాలకొల్లు సెంట్రల్: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధి గొందిమూల ప్రాథమిక పాఠశాలలో శనివారం ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని రాజశ్రీ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. తొలుత ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ప్రతి అమ్మాయీ తనకున్న హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలని ఆంధ్ర విద్యార్థి సంఘం వీర నారి విభాగం జిల్లా అధ్యక్షులు యరసింగు ప్రశాంత్ చౌదరి అన్నారు. మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి పురస్కరించుకుని పట్టణంలో వీర నారి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఝాన్సీ లక్ష్మీబాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నల్లమిల్లి వంశీ, షేక్ సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాలలో స్త్రీ శక్తి దివస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యిమ్మిడి లలిత ఝాన్సీ లక్ష్మీబాయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, ఫెమినా క్లబ్ ప్రెసిడెంట్ మాచేపల్లి ఉమ, నంబూరి భాగ్యలక్ష్మి, కంచర్ల సుశీల తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెనుగొండ: ఆచంటలో పాలకొల్లు ఎక్సైజ్ అధికారులు, ఈఎస్‌టీఎఫ్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన దాడుల్లో బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. కరణి శ్రీనివాసు అనే వ్యక్తి నుంచి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గిడ్డంగి ఆకస్మిక తనిఖీ



పౌరసరఫరాల గిడ్డంగిలో సరుకు నిల్వలను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: ప్రతి రేషన్‌కార్డుదారునికీ బియ్యం, కందిపప్పు, పంచదార అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ దాసి రాజు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన నరసాపురం మండలం సరిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని పౌర సరఫరాల మండలస్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డిసెంబర్ నెలకు సంబంధించి గోడౌన్ వద్ద ఉన్న రేషన్ సరుకుల వివరాలను పరిశీలించారు. రేషన్‌కు సంబంధించి 80శాతం కందిపప్పు, 100 శాతం పంచదార నిల్వలు ఉన్నాయని వాటిని విధిగా బియ్యం కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి కిలో కందిపప్పు, అరకిలో పంచదార అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్డీఓ వెంట సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఐతం సత్యనారాయణ, నందనరావు తదితరులు ఉన్నారు.

రైతుకి ఇష్టమైన మిల్లులో ధాన్యం విక్రయం

పాలకొల్లు అర్బన్/పెనుగొండ: రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యాన్ని రైతులు తమకిష్టమైన రైస్ మిల్లులో ధాన్యం విక్రయించుకోవచ్చని ఆర్డీవో దాసి రాజు చెప్పారు. పోడూరు మండలం జిన్నూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కల్లాల్లో ధాన్యం ఎగుమతి చేసిన వాహనాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లాల్లో రైతులతో ఆర్డీవో మాట్లాడారు. తేమశాతం, గోనె సంచులు, వాహన రవాణా, మద్దతు ధర తదితర అంశాలను రైతులకు వివరించారు. ధాన్యం కల్లంలో సిద్ధం చేసిన వెంటనే సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేస్తారన్నారు. మిల్లులకు రవాణా చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ అవుతాయన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, కార్యదర్శి హరివిష్ణు, వీఆర్వో నాగరాజు, వీఏవో సూర్యకిరణ్, రైతులు జి.మృత్యుంజయరాజు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శానిటరీ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. వార్డుల్లో సరిపడగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమంచి ఎక్కడా పారిశుద్ధ్య ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. డ్రెయిన్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా లక్షబిల్వార్చన, జ్యోతిర్లింగార్చన



పెనుమంట్ర: మార్టేరులో జ్యోతిర్లింగార్చన చేస్తున్న భక్తులు



పెనుగొండ: రుద్ర హోమంలో పాల్గొన్న శివస్వాములు

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల ఆవరణలో మంగళవారం రాత్రి పార్థీవ లింగేశ్వరునికి లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన పూజలు ఘనంగా జరిపారు. వేద పండితులు వడగం విజయకుమార్ ఆధ్వర్యంలో పార్థీవ లింగాన్ని తయారు చేసి భక్తులతో సామూహిక లక్ష బిల్వార్చన పూజలు, జ్యోతిర్లింగార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పార్వతి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో పలువురు గ్రామ ప్రముఖులు దంపతులు పాల్గొన్నారు.

క్షీరారామంలో గణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సంకట హర చతుర్థి పురస్కరించుకుని ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు కార్తీకమాసం సందర్భంగా కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారికి మహన్యాసపూర్వక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో గణపతి హోమం పూజా కార్యక్రమాలు చేశారు. ఈ హోమంలో 20 మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే స్థానిక 24వ వార్డు శంభన్న అగ్రహారంలో శంభేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా స్వామివారికి కార్తీక దీపోత్సవం, లక్ష్మీపత్రి పూజ నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. రాత్రి శివలింగం, ఓంకారం, త్రిశూలం అలంకారంలో దీపోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అచ్చయ్య శాస్త్రి, గున్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష పత్రి పూజ

పెనుగొండ: కార్తీక మాసం సందర్భంగా ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయంలో లక్ష్మీ పత్రి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఆచంటకు చెందిన కమ్మ కులస్తుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం, ఆచంటేశ్వరునికి పత్రి పూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

వైభవంగా రుద్రహోమం

పెనుగొండ: శివస్వాములు మంగళవారం శ్రీలక్ష్మీ గణపతి సహిత శ్రీ రుద్ర హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండ లింగాల వీధిలోని ఉమా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక మాసం ఆరుద్ర నక్షత్ర సంకట హర చతుర్థి సందర్భంఆ ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు చేబోలు పవన్ శర్మ బ్రహ్మత్వంలో గురుస్వామి షణ్ముక కోటి లింగాల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకీ సేవ చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.